# భగవంతుని నిమిత్తమై భగవంతుని ప్రేమించటమే నిజమైన భక్తి

అస్థిరం జీవనం లోకే అస్థిరం యౌవనం ధనమ్
అస్థిరం దారపుత్రాది ధర్మకీర్తిద్వయం స్థిరమ్.

పూర్ణ ప్రేమయందె పుట్టును సౌఖ్యంబు
సత్య త్యాగ శాంతి క్షమలు నబ్బు
ప్రేమ లేకయున్న క్షేమంబు లేదయా
సత్యమైన బాట ఈ సాయి మాట.

ప్రేమరూపంబు బ్రహ్మంబు ప్రేమమయము
ప్రేమ ప్రేమతో సంధింప నీమమగును
కాన ప్రేమను గట్టిగా కల్గియున్న
అద్వితీయమునొందంగ అర్హుడగును.

ప్రేమస్వరూపులారా!

ప్రేమకు మించిన పదార్థము యీ జగత్తునందు మరొకటి లేదు. ప్రేమే దైవము, దైవమే ప్రేమ. దైవమే జగత్ స్వరూపము. ప్రేమకు సాటి ప్రేమయే! ప్రేమకు ఫలము ప్రేమయే! ప్రేమయొక్క రసమును, రుచిని ఎరిగింప చేయునది ప్రేమనే! ఈ ప్రేమను వర్ణించుటకు భాషగానీ వాక్కుగానీ కానరాదు. కనుకనే 'యథోవాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ' అన్నారు. శాస్త్రములు 'శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రః', అమృతమునకు మించిన

sri sathyasai vachanamrutam

మాధుర్యము జగత్తునందు లేదని వర్ణించింది. కానీ ప్రేమ దగ్గర యీ అమృతముయొక్క రుచి యేమాత్రము నిలువలేదు. యిట్టి పవిత్రమైన, దివ్యమైన, నవ్యమైన ప్రేమతత్త్వాన్ని మానవుడు కోల్పోవటంచేతనే అశాంతికి గురియై, అక్రమాలకు మూలమై అధర్మమునకు స్థానమై అశాంతిని అనుసరిస్తున్నాడు. దైవప్రీతి, పాపభీతిని కోల్పోవటంచేతనే మానవత్వములో దానవత్వము యేర్పడి దివ్యత్వమును దూరము చేసుకొనుచున్నది.

**ఇహమున సుఖింప హేమతారకవిద్య, పరమున సుఖింప బ్రహ్మవిద్య**

> **పాపభీతి లేని పామరత్వముబట్టి**
> **దైవప్రీతి లేని దారిపట్టి**
> **మానవత్వమణగె మానవులందున**
> **విశ్వశాంతికిదియె విప్లవంబు.**

ప్రాకృతమైన ప్రేమయందు దివ్యత్వము కానరాదు. ప్రేమ ఒక్కటే అయినప్పటికిని భౌతికమైన మార్గములో ప్రవేశపెట్టినప్పుడు దీనిని అనురాగమనియు, యీ ప్రేమను దైవమువైపు మరల్చినప్పుడు ప్రపత్తి, ప్రేమతత్త్వము అని రెండు విధములుగా బోధిస్తూ వచ్చింది, శాస్త్రము. యీ ప్రేమతత్త్వమును యీనాడు కోల్పోవటానికి కారణం ఏమిటి? ప్రాకృతమైన, అనిత్యము, అశాశ్వతము అయిన భావములందే మానవత్వము అత్యంత ప్రీతితో దీనిని అనుసరిస్తూ వస్తున్నది. ప్రాకృతమైన జీవితము అవసరమే! 'యిహమున సుఖింప హేమతారకవిద్య, పరమున సుఖింప బ్రహ్మ విద్య.' ఈ రెండింటియందు నెగెటివ్, పోజిటివ్‌వలె ప్రాకృతమైన, దివ్యమైన భావములతో మానవుడు జీవించవలసివస్తుంది. కాని, ప్రాకృతము సత్యనిత్యమని భావించి, దివ్యత్వమును అసత్యము అనిత్యము అని విశ్వసించి, మానవత్వమును మరపింపచేసే లౌకిక భోగములలో మాత్రము మక్కువ చూపరాదు. కనుకనే యీనాటి మానవత్వమునందు ప్రేమరసమును చవిచూడలేని దివ్యత్వమును మనము అనుభవిస్తున్నాము.

**మనస్సును మాధవత్వమువైపు మరల్చటమే భక్తి**

'భక్తి,' 'భక్తి,' 'భక్తి' అని ఈనాడు మనం చెప్పుకుంటున్నామేగాని భక్తికి నిర్వచనము

sri sathyasai vachanamrutam

ఏమిటి? భక్తిభావమనగా తన మానసతత్వమును దైవత్వముగా మార్చుకోటమే! మనస్సును మాధవత్వమువైపు మరల్చటమే భక్తి. యిట్టి భక్తి, ప్రపత్తులయొక్క తత్వమును యీనాడు మానవుడు విస్మరించుచున్నాడు. దైవమును చింతించటము, దైవమును పూజించటము, దైవమును ఆరాధించటము దైవనిమిత్తమని మీరు భావిస్తున్నారు. యివన్నీ తన నిమిత్తమై తాను ఆచరిస్తున్నాడే గానీ దైవనిమిత్తము ఆచరించే కర్మలు కావు. ఒక పదార్థమును మానవుడు ప్రేమిస్తున్నాడంటే పదార్థనిమిత్తమై ప్రేమించుట లేదు. తన నిమిత్తమై పదార్థములను ప్రేమిస్తున్నాడు. ఒక వ్యక్తిని తాను ప్రేమిస్తున్నాడంటే ఆ వ్యక్తి నిమిత్తమై వ్యక్తిని ప్రేమించటంలేదు. తన నిమిత్తమే ఆ వ్యక్తిని ప్రేమిస్తున్నాడు. అటులనే భగవంతునికూడను తన నిమిత్తమై ప్రేమిస్తున్నాడుకానీ భగవంతుని నిమిత్తమై ప్రేమించుట చాలా అరుదుగా ఉన్నది. భగవంతుని నిమిత్తమై భగవంతుని ప్రేమించటమే నిజమైన భక్తి. యీ లౌకిక ప్రేమతత్త్వమునందు అంతో యింతో స్వార్థము, అహంకారము యిమిడి ఉంటున్నాయి. కనుకనే దీనికి 'అనురాగము' అని పేరు పెడుతూ వచ్చారు. స్వార్థమును త్యజించి, పరార్థమును విశ్వసించి, దివ్యత్వమును ఆరాధించి ఆనందమును అనుభవింపచేసుకోటమే నిజమైన భక్తి, ప్రపత్తుల సారము. స్వార్థ, స్వప్రయోజనములు ఉండినంతవరకు దివ్యత్వమనేది తనలో వికసింప చేసుకోలేరు, ప్రకాశింపచేసుకోలేరు. కఠిన హృదయులకు భగవంతుడు కానరాడు. విశ్వాసము అత్యంత అవసరము. విశ్వాసమనేది లేకుండిన మానవత్వము యేమాత్రము రాణించదు. కనుక, విశ్వాసము అత్యవసరము. యిందులో ప్రేమతత్త్వముతో కూడిన విశ్వాసము ప్రధానము. యీ ప్రేమ పరమాత్మనే తన్మయత్వము గావిస్తుంది. భక్తుని ఉన్మత్తుని గావిస్తుంది. భగవంతుని, భక్తుని నాట్యమాడిస్తుంది. యిట్టి పవిత్రమైన ప్రేమతత్త్వాన్ని కోల్పోవటంచేతనే మానవుడు అశాంతికి గురయి అక్రమాలకు, అనాచారములకు పాల్పడుతున్నాడు. మన ప్రెసిడెంటు శంకరదయాళ్ శర్మ వివేకానందుని faith in yourself, faith in the country, faith in God, this is the secret of grace అనే వాక్యమును ఉదహరించాడు. మానవత్వములో దివ్యత్వమనేది ఎలాంటిది? మొట్టమొదట self confidence. ఆత్మవిశ్వాసము లేనివానికి దేశమునందు, దైవమునందు విశ్వాసము ఎలా కలుగుతుంది?



sri sathyasai vachanamrutam

## విద్యార్థులలో జాతీయతా భావము బాగా అభివృద్ధి కావాలి

విద్యార్థులారా! యీనాడు విద్యావిధానమునందు జాతీయతా భావము అనేది యేమాత్రము కనుపించుట లేదు. కేవలము సమాజములో వ్యక్తియొక్క అభివృద్ధి నిమిత్తమై విద్యను అభ్యసిస్తున్నారు. జాతీయతాభావము కోల్పోవటంచేతనే మానవునికి, మానవునికి మధ్య అనేక విధములైన ద్వేషములు అభివృద్ధి అవుతూ వస్తున్నాయి. కనుక, జాతీయతా భావము విద్యార్థులలో అమితంగా అభివృద్ధి కావాలి. యిది నా దేహమని యే విధంగా ధైర్యంగా చెప్పుకుంటున్నావో, అదే విధంగా యిది నా దేశమని ఆత్మవిశ్వాసముతో ప్రకటించాలి. దేశము, దేహము బింబప్రతిబింబములు. దేహాభిమానము ఎంత అభివృద్ధి గావించుకుంటున్నావో దేశాభిమానమునుకూడను అంతగా అభివృద్ధి గావించుకోవాలి. దేశాభిమానము కలిగినప్పుడే మానవత్వమును అభివృద్ధి గావించుకున్నవారమవుతాము. Science and Technology, head వంటిది అన్నారు, ప్రెసిడెంట్. కానీ తల ఉండినంత మాత్రమున ప్రయోజనము లేదు. Spiritual heart గా తయారుకావాలి. Spirituality, heart; Science and Technology, head; hand ధర్మము. ఈ 3H లను మనము అభివృద్ధి పరచుకోవాలి. EHV అనగా Education in Human Values అంటుంటారు.

## తెలుసుకోవటంలో ఎక్కువగా ఫలితము లేదు, ఆచరించటములో ఉన్నది

EHV కాదు 3H-heart, head and hand. అదే నిజమైన Education. దీనినే the proper study of mankind is man అన్నారు. Mankind అంటే ఏమిటి? Heart, head and hand. ఈ మూడింటిని ఏకముగా చేయటమే mankind. దీనినే వేదాంతిక పరిభాషయందు 'త్రికరణశుద్ధి' అన్నారు. ఈ త్రికరణశుద్ధి కలిగినప్పుడే జ్ఞానసిద్ధికూడను మనకు కలుగుతుంది. యీనాడు ప్రేమతత్త్వాన్ని మనం అభివృద్ధి గావించుకోవాలి. ఎంతమందిని నీవు అధికముగా ప్రేమిస్తావో నీకు అంత అధికమైన ఆనందము ప్రాప్తిస్తుంది. ఎంత తక్కువమందిని నీవు ప్రేమిస్తావో నీ ఆనందముకూడను అంత తక్కువగా ఉంటుంది. కనుక, నీవు ఆనందమును అనుభవించవలెనన్న అంత అధికమైన జనాన్ని ప్రేమించాలి. 'అందరియందు ఉండిన దైవత్వము ఒక్కటే,' అనే విశ్వాసమును బలపరచుకోవాలి.

srisathyasaivahini.org

'ఏకోవసి సర్వభూతాంతరాత్మ,' 'ఏకమేవ అద్వితీయం బ్రహ్మ,' 'ఈశ్వరస్సర్వభూతానాం,' 'ఈశావాస్యమిదం సర్వం.' ఈ సత్యాన్ని మనం కేవలం వల్లించేదానికంటే ఆచరించటం అత్యవసరము. రామాయణము అనేకమంది చదువుతున్నారు. రామాయణములో పితృవాక్య పరిపాలన అత్యవసరమైనదని భావిస్తున్నాము. 'రామో విగ్రహవాన్ ధర్మః' అని ధర్మస్వరూపుడు, రాముడు. కానీ మనలో ఎంతమంది ఈ వాక్యములను ఆచరిస్తున్నారు? ఎంతమంది పితృవాక్య పరిపాలన గావిస్తున్నారు? ఇక రామాయణము చదివి ప్రయోజనము ఏమిటి? ఎంతకాలము అయినా తెలుసుకోటం, తెలుసుకోటమని కాలము వ్యర్థము చేస్తే ఆచరించటం ఎప్పుడు? తెలుసుకోటంలో మనకు ఫలితం లేదు. ఆచరించటములో ఫలితముంటున్నాది. పంచభక్ష్యపరమాన్నములు పాకము చేసినంతమాత్రమున మన ఆకలి తీరదు. వాటిని భుజించినప్పుడే మన ఆకలి తీరుతుంది. అదే రీతిగా మనము తెలుసుకోటమనేది, పఠించటమనేది, వినడమనేది కేవలము ఒక విధమైన వంటను చేసినట్లుగా ఉంటుంది. కాదు, కాదు; ఆచరించటము, అనుభవించటము కావాలి. అప్పుడే నీకు అశాంతి అనే ఆకలి తీరుతుంది.

**అహంకారము, కోరిక ఈ రెండింటిని తీసివేస్తే మిగిలేది శాంతియే!**

శాంతి, శాంతి, శాంతి! ఎక్కడ ఉంటున్నాది? ఈనాడు ప్రపంచములో ఎక్కడకు వెళ్లినా శాంతి మనకు కనిపించటం లేదు. అనేకమంది విదేశీయులంతా వస్తున్నారు. నీకు ఏమి కావాలని ప్రశ్నించినప్పుడు I want peace, I want peace అంటారు. I want peace అనే వాక్యములోనే peace ఉంటున్నాది. I want peace అనే వాక్యములో మూడు పదములు ఉంటున్నాయి. I-ego, want-desire, ఈ రెండు తీసేస్తే peace అక్కడే నిలచి ఉంది. ఈ రెండింటిని తీసివేస్తే మనమే శాంతిస్వరూపకంగా తయారౌతాము. స్వస్వరూపమైన శాంతిని ఎక్కడ మనం వెతకటానికి ప్రయత్నిస్తాం? ఆనంద స్వరూపుడైన భగవంతుని ఎక్కడెక్కడో వెదకటానికి, దూర ప్రదేశములో వెతకటానికి మనం ప్రయత్నిస్తున్నాము. తనయందే ఉన్న దైవత్వాన్ని చూడటానికి అరణ్యమునకు పోనక్కరలేదే! అదియే పురుషసూక్తమునందు 'అంతర్బహిశ్చ తత్సర్వమ్ వ్యాప్య నారాయణస్థితః' అని

sri sathyasai vahini amrutam

చెప్పబడింది. లోపల, వెలుపల సర్వత్ర ఉండిన భగవత్ తత్త్వాన్ని వెదికేది ఎక్కడ? ఎక్కడో ఒకేచోట ఉంటే వెతకటానికి ప్రయత్నించాలి.

## దైవత్వాన్ని మరుగుపరచే మన రాగద్వేషములు తొలగిస్తే దైవత్వము సాక్షాత్కరిస్తుంది

సర్వత్రా ఉండిన భగవంతుని వెదికేది ఎక్కడ? ఐతే సర్వత్ర ఉండినవాడు ఎందుకు కనుపించకుండా ఉన్నాడు అన్నది ప్రశ్న. భగవంతుడు ఉన్నాడు; కానీ, రాగద్వేషములచే కప్పబడటంచేత మనకు కనుపించటంలేదు. అగ్ని అక్కడ ఉంటున్నాది. దాన్ని మనం అలక్ష్యము చేశాము. కనుక, దానికి నిమురు వచ్చి కప్పుకుంది. ఈ నిమురు ఎక్కడనుండి వచ్చింది? అగ్నినుంచే వచ్చింది. అగ్నినుంచి వచ్చిన నిమురు అగ్నినే కప్పి వేసింది. అగ్ని కనుపించటం లేదు. కారణం ఏమిటి? యీ నిమురుచేత కప్పబడింది. కప్పబడిన నిమురు తీసివేస్తే అగ్ని కనిపిస్తుంది. అదే రీతిగా దైవత్వము నీయందే ఉంటున్నాడు. నీ జంట కంట యింటా ఉంటున్నాడు. అలాంటి దైవత్వాన్ని మరుగుపరచే యీ రాగద్వేషములు తీసివేస్తే దైవత్వము సాక్షాత్కరిస్తుంది. ఈనాడు ప్రాకృతమైన విషయములందు ఎంత రాగమును పెంచుకుంటున్నామో దానిలో ఏ కించిత్ భాగమైనా దైవత్వంపైన మనం పెంచుకుంటున్నామా?

**యాచింతా భువి పుత్రమిత్ర భరణౌవ్యాపార సంభాషణే**
**యాచింతా ధన ధాన్య భోగ యశసే లాభే సదా జాయతే**
**సాచింతా భువి నందనందన పదద్వంద్వారవిందే క్షణే**
**కాచింతా యమరాజ భీమసదన ద్వార ప్రయాణే ప్రభో**

ఈ ప్రాకృత విషయములపైన మనము ఎంత కాలము వ్యర్థము చేసుకుంటున్నామో ఆ కాలములో ఒక్క క్షణమైనా భగవంతుని పాదారవిందములందు దృష్టి పెడితే మన జీవితం ఎంత సార్థకమవుతుంది!

## సత్కర్మలలో ప్రవేశించి కాలమును సార్థకము చేసుకోవాలి

విద్యార్థులారా! కాలము చాలా ప్రధానమైనది. కాలమే భగవత్ స్వరూపము. ఈ



sri sathyasai vachanamrutam

అనంతమైన కాలతత్త్వమును అరక్షణమైనా మనము వ్యర్థము చేయరాదు. కదలిపోయిన కాలము మనకు తిరిగి రాదు. వచ్చే కాలము మనది కాదు. ఉన్న కాలమును సార్థకము చేసుకోవాలి. సత్కర్మలయందు ప్రవేశించాలి. ఈ సేవయే ప్రధానమని మన భారతదేశముయొక్క ప్రెసిడెంటు శంకర్‌దయాళ్ శర్మ చెప్పాడు. ఎంత ధనము ఉంటుండి ప్రయోజనము ఏమిటి? తోటి మానవులయొక్క సేవ మనము చేయాలి. 'నాకు పదవులు, అధికారము అక్కరలేదు. నేను ఏ సుఖశాంతులు కోరనక్కరలేదు, నాకు ఏదీ అక్కరలేదు. భగవంతుడా! నాకు మానవసేవను అనుగ్రహించమ'ని కోరాడు, ఆయన. యజ్ఞయాగాది క్రతువులు చేసినంతమాత్రమున మనము దివ్యత్వమును పొందలేము. దానధర్మాది సత్కర్మలు ఆచరించటముచేత మనము శాంతిని పొందలేము. ఆత్మతత్త్వమును గుర్తించి, అహంకారమును త్యాగము చేసి సమాజసేవలో నడుము కట్టినప్పుడే మనము శాంతిని పొందగలుగుతాము. సేవ అనేది అహంకారమును నిర్మూలము గావిస్తుంది. జీవితతత్త్వమును చక్కగా గుర్తింపచేస్తుంది. తోటి మానవుల సహకారమును ఆనందముగా అనుభవిస్తుంది. కనుకనే

**సహనావవతు సహనౌభునక్తు**
**సహవీర్యం కరవావహై**

అని. యీ మంత్రములో ఉండిన అర్థము ఏమిటి?

**కలసిమెలసి తిరుగుదాం కలసిమెలసి పెరుగుదాం**
**కలసిమెలసి కలిమిచెలిమి బలముగుణము పెంచుదాం**
**కలసిమెలసి తెలుసుకొన్న తెలివిని పోషించుదాం**
**కలసిమెలసి కలిమితోడ చెలిమిగ జీవించుదాం**

యిదియే దివ్యమైన వేదసారము. యిందులో మత భేదములుగానీ, మత బోధలు కానీ యే మాత్రము కానరావు. 'సహనావవతు' అందరు కలసి వుండాలి. కులమతభేదములకు యే మాత్రము అవకాశమునందించరాదు. వీటికి అవకాశము ఎక్కడ ఉంది? కుల, మత భేదములు భగవంతునికే లేనప్పుడు మానవునికి ఎక్కడనుంచి వచ్చాయి? గగనమునదే కులము? గాలిదే

srisathyasai vahini vachanamrutam

కులము? నీరుదే కులము? నిప్పుదే కులము? భూమిదే కులము? పంచభూతములను సర్వులూ సమానముగనే అనుభవిస్తున్నారు కదా! యీ కుల, మతములను కేవలము స్వార్థముతో అనుభవించుకోటానికి యిన్ని కల్పనలను అభివృద్ధి పరుస్తున్నారు.

## మానవునికి పవిత్రమైన నడతలే ధర్మము

ప్రేమస్వరూపులారా! సర్వులుకూడను భగవంతుని బిడ్డలే! ఏవో కొన్ని ఆచారములు, సిద్ధాంతములు వేరువేరుగా నిర్మించుకోవచ్చును. కానీ, సమాజమునందు అందరు ఒక్క కుటుంబముగా భావించాలి. సత్యము, ధర్మము, న్యాయము, యిట్టి పవిత్రమైన సూత్రములకు భారతదేశము జన్మభూమి. సత్యధర్మములయొక్క జీవితమే వేదము ప్రబోధిస్తూ వచ్చింది. విద్యార్థులు గురుకులములో ప్రవేశించి, విద్యను అభ్యసించి, గృహస్థు ఆశ్రమములో ప్రవేశించేందుకు పూర్వము టీచర్లు అంతా చేరి వీరికి సత్యధర్మములు గురించి బోధిస్తూ వచ్చారు. దీనినే 'శిక్షావల్లి' అని చెప్పారు. 'సత్యంవద, ధర్మంచర; మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ' అనే ఆదేశములను శిష్యులకు బోధిస్తూ వచ్చారు. ఈ పదములంతా సమాజములో అన్ని వర్గములకు ఎంత సమత్వమైనటువంటివి. సర్వులకు సమానమైనటువంటివి. ఒక చిన్న ఉదాహరణము చూడండి. సత్యము-యిది బ్రాహ్మణ సత్యము, యిది శూద్రసత్యము, యిది క్షత్రియసత్యము, యిది వైశ్యసత్యమని ఎక్కడైనా విభాగము ఉందా? అందరికి సత్యం, సత్యమే! త్రికాలాభాద్యమైనది, సత్యం. 'సత్యంనాస్తి పరోధర్మః.' సత్యమునకు మించిన ధర్మము మరొకటి లేదు. ధర్మమంటే ఏమిటి? 'ధారయతీతి ధర్మః.' మనస్సు, వాక్కు, క్రియ మూడింటి ఏకత్వముచేత పూర్ణమైన విశాల భావముతో ఆచరించే నడతలే ధర్మము. అగ్నికి దహనశక్తి ధర్మము. పుష్పమునకు సుగంధము ధర్మము. మంచుకు చల్లదనము ధర్మము. అదే విధముగా మానవునికి పవిత్రమైన నడతలే ధర్మము. దీనిని మనం చక్కగా గుర్తించాలి.

## భగవంతుడే నిజమైన మిత్రుడు

ఎవరిని నొప్పించకూడదు; ఎవరిని బాధించకూడదు. దీనినే వ్యాసులవారు చెప్పారు,

18 పురాణముల సారముగా:

**అష్టాదశ పురాణేషు వ్యాసస్య వచనద్వయం**
**పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం**

దీనినే మరొక విధంగా చెప్పాలంటే Help ever, hurt never. ఎవరిని మనం బాధించకూడదు. బాధించకుండా ఉండినంత మాత్రమున సరిపోదు. అనగా Help ever, బాధించకుండా యితరులకు సహాయము చెయ్యాలి. యిది సాధ్యమా? తప్పక సాధ్యము. మానవత్వములోపల దివ్యమైన భక్తిమార్గమును గురించి అనేక విధములుగా ప్రబోధిస్తూ వచ్చారు. భక్తి ఆరు రకములుగా ఉంది. శాంత భక్తి, సఖ్య భక్తి, దాస్య భక్తి, అనురాగ భక్తి, వాత్సల్య భక్తి, మధుర భక్తి. ఈ ఆరు భక్తులందు ప్రేమతత్త్వము అంతర్వాహినియై ఉంటున్నాది. ప్రేమయందు అన్నీ ఏకమై ఉంటున్నాయి. యింక భక్తి మార్గములు తొమ్మిది:

**శ్రవణం కీర్తనం విష్ణోస్మరణం పాదసేవనం**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనం**

స్నేహము తరువాతనే ఆత్మనివేదనము. ఏమిటి యీ స్నేహము? ఎలాంటి స్నేహము? Hello, Hellow how are you? How are you? యిది కాదు friendship; heart to heart, love to love. హృదయానికి హృదయము. యీ ప్రేమతత్త్వము ఎక్కడ ఉంటున్నాది? ఎక్కడ ఉన్నాడు నీ మిత్రుడు? ఎవరు నీ మిత్రుడు? జేబులో డబ్బులు ఉన్నాయి. మంచి స్థానములో ఉంటున్నాడు. అంతవరకు హాలో హాలో అంటుంటాము. అందరూ మిత్రులే! రిటైర్ అయిన తరువాత గుడ్‌బై చెప్పేవాడుకూడా ఉండరు. కాదు కాదు. భగవంతుడు ఎప్పుడూ నీ వెంటనే ఉంటాడు. God is always with you, in you, around you, above you, below you. అట్టి భగవంతుని మనం మిత్రునిగా తీసుకోవాలి. అందువల్లనే అర్జునుడు కృష్ణుని మిత్రునిగా తీసుకోవటంవలనే అన్నింటియందు కూడను విజయాన్ని సాధిస్తూ వచ్చాడు. కనుక దైవమును నిజమైన మిత్రునిగా తీసుకోవాలి.

**ప్రేమ ఎంత కఠినమైన హృదయమునైనా కరిగింపజేస్తుంది**

sri sathyasai vahini vachanamrutam

అందరియందు దైవమున్నాడనే విశాల భావమును పెంచుకోవాలి. 'అద్వేష్టా సర్వభూతానాం' ఎవ్వరిని ద్వేషించకూడదు. విశాలమైన భావాలు పెంచుకోవాలి. ప్రేమ చాలా విశాలమైనది. ఈ ప్రేమ అనేది కఠిన హృదయాన్నికూడను కరిగింపచేస్తుంది. పూర్వకాలమందు కఠినమైన అరణ్యములందు కేవలము క్రూరమృగములమధ్య అనేకమంది ఋషులు తపస్సు ఆచరిస్తూ ఉండేవారు. వారి దగ్గర ఏ అస్త్రములు లేవు. వారి దగ్గర ఉన్నది, కేవలం భగవంతునిపైన ప్రేమ అనే అస్త్రము. ఆ ప్రేమాస్త్రమును వారు ధరించడంచేత క్రూరమృగములతో కూడను స్నేహముగా వుంటుండి యిరువురు ఒకే అరణ్యములో సుఖముగా, శాంతిగా జీవిస్తూ వచ్చారు. ఆ ప్రేమ క్రూరమృగములయొక్క హృదయాన్నికూడను కరిగింపచేసింది. యిలాంటి ప్రేమ ఎంత పవిత్రమైనది! అట్టి ప్రేమను యీనాడు మానవుడు కోల్పోవటంచేత ద్వేషములు పెరిగిపోతున్నాయి. ఈనాడు మానవునకు, మానవునకు మధ్య యేమాత్రము కూడను సంబంధబాంధవ్యములు కనుపించటంలేదు. అదికాదు, మానవుల మధ్యనున్న ప్రేమ తత్త్వము.

**మానవులు భిన్నభిన్నముగా కనిపించినప్పటికిని అందరియందు ఒకే ఆత్మతత్త్వముంటుందనే సత్యమును గుర్తించాలి**

మానవత్వమును ఏకత్వముగా భావించాలి. Unity in diversity. ఇక్కడ ఎంతమంది ఉంటున్నారు, చూడండి! కానీ

**Beings are many, breath is one,**
**Jewels are many, gold is one,**
**Stars are many, sky is one,**
**Nations are many, earth is one**

మానవులు భిన్నభిన్నముగా కనుపించినప్పటికిని అందరియందు ఒకే ఆత్మతత్త్వము ఉంటున్నాదనే సత్యమును గుర్తించాలి. యిదే మన భారతీయ సంస్కృతియందు గల ప్రధానమైన గుణమగు విశాలత్వము. 'సంస్కృతి' అనే పదానికి అనేకమంది అనేక విధములుగా అర్థము చెప్పుతూ వచ్చారు. వ్యాఖ్యానములు ఎవరికి తగినట్లుగా వారు

srisathyasaivachanamrutam

చేస్తూ వచ్చారు. యీ సంస్కృతి అనే దానిపైన పరిశోధనలు సలుపుతూ వచ్చాడు, ఎలియట్. చేసి చేసి కట్టకడపటికి ఒక చిన్న వాక్యములో దీన్ని చెప్పి ముగించాడు. యీనాడు మన సంస్కృతిని మనం కోల్పోయినాము. జీవిత మార్గమును కోల్పోయిన తరువాత జీవితము ఎందుకింక?

**Life is a challenge, meet it**
**Life is a game, play it**
**Life is a dream, realise it**
**Life is love, enjoy it.**

అన్నింటిని తెలుసుకోవాలి మనం. అన్నింటిని తెలుసుకున్న తరువాతనే మంచిని మనం పోషించుకోటానికి వీలవుతుంది.

**తనను తాను తెలుసుకోనప్పుడు అన్నీ తెలుసుకుని ప్రయోజనమేమిటి?**

విద్యార్థులారా! మనం awareness అనే పదానికి ఏదో తెలుసుకోటమని భావిస్తున్నాము. యింతా, యింతా తెలుసుకుంటే awareness కాదు. అంతా తెలుసుకోవాలి.

**పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే.**

పూర్ణముగా తెలుసుకోవాలి. (చేతి రుమాలుని) దీన్నంతా చేతిలో పెట్టుకొని ఇది ఏమిటంటే piece of cloth అంటాము. యిది తెలుసుకున్నట్లు కాదు. దీనిని విప్పాలి. What is this? Kerchief! అదే awareness. పరిపూర్ణ understandingనే awareness అంటారు. యీనాడు పరిపూర్ణ understanding చేసుకోటం లేదు. ఏదో యింతో అంతో తెలుసుకొని అన్నీ తెలుసుకున్నట్లుగా మనం విఱ్ఱవీగుతున్నాము. ఈనాటి పిల్లలలో యిదే పెద్ద దుర్గుణము. 'నాకు అన్నీ తెలుసున'నుకుంటున్నారు. అన్నీ తెలుసు; కానీ తానెవరో తనకు తెలియదు. అది తెలుసుకోనప్పుడు అన్నీ తెలుసుకొని ప్రయోజనం ఏమిటి? 'నాకు అన్నీ తెలుసును, నేను ఎవరో చెప్పండి' అంటే 'ఎంత పిచ్చివాడురా! వీడు,' అనుకుంటారు.



sri sathyasai vahini vachanamrutam

మొట్టమొదట నీవు ఎవరో నీవు తెలుసుకోవాలి. This is my body, my mind, my senses, అంటారు; కాని but who am I అని question వేసుకోటం లేదు. నీవు body కాదు నీవు mind కాదు నీవు senses కాదు. ఇవన్నీ కేవలము instruments. This is my kerchief అన్నప్పుడు kercheif is separate from you. My tumbler అన్నప్పుడు tumbler is separate from you. My body means, body is separate from you; then who are you? యీ తత్త్వాన్ని చక్కగా తెలుసుకోటానికి ప్రయత్నించాలి. విద్యార్థులారా! ఎన్ని గ్రంథములు చదివినప్పటికిని, ఎన్ని వ్యాసములు మనం వ్రాసినప్పటికిని, ఎన్ని విధములుగా గురువులు మనకు బోధించినప్పటికిని మనము తెలుసుకోవలసినది ఒకటి తెలుసుకోవాలి. యివన్నీ భౌతిక విద్యలే! యీ జగత్తులో మనము జీవితము గడిపేంతవరకు యీ విద్యలు మనలను పోషిస్తాయి. కానీ జీవితమంటే కేవలము దేహము, మనసు, బుద్ధి మాత్రమే కాదు. దీనికి ఆత్మ అనేది ఒకటి ఉంటున్నాది. అది పారమార్థికముతో తెలుసుకోవాలి. యీ లౌకిక విద్యలతో తెలుసుకోటానికి వీలు కాదు. దానిని తెలుసుకొనే విద్యయే పర విద్య. అట్టి పర విద్యను తెలుసుకోటానికి మనం ప్రయత్నించాలి.

**మానసిక పరిణామముతోబాటు ఆధ్యాత్మిక పరిణామము రావాలి**

విద్యార్థులారా! మీ భావములు చాలా పవిత్రమైనవి. కానీ, ప్రేమతత్త్వాన్ని మీరు సంకుచితమైన రీతిగా పెంచుకోరాదు. 'నేను, నావారు' అంతవరకే మనం పోకూడదు. సమాజము ఒకటి ఉంటున్నాది. 'సమాజము ఉండటంవలనే నా కుటుంబము ఉంటున్నాది. నా కుటుంబము ఉన్నది కనుకనే నేను ఉన్నాను. నేను కుటుంబముపైన ఆధారడి ఉంటున్నాను. ఈ కుటుంబము సమాజముపైన ఆధారపడి ఉంటున్నది. కాబట్టి సమాజముయొక్క క్షేమమే నా క్షేమము' అని తెలుసుకోవాలి. కనుకనే ప్రాచీన కాలములో అందరు 'లోకాస్సమస్తా సుఖినో భవంతు' అని ప్రార్థన చేసేవారు. అది భారతీయుల ప్రాచీన సాంప్రదాయము. అందరు సుఖముగా ఉంటుండాలి అన్నదే వారి ఆకాంక్ష. వ్యక్తియొక్క సుఖము సమాజముయొక్క సుఖముపై ఆధారపడి ఉంటున్నాది. ప్రతి వ్యక్తికూడను లోకక్షేమాన్ని ఆశించాలి. మానవ నిర్మాణమే లోక నిర్మాణము. మానవుడు బాగుపడినప్పుడే

srisathyasaivachanamrutam

లోకము బాగుపడుతుంది. కనుక మానవునిపైన ఆధారపడి ఉంటున్నాది, జీవితము. యీ మానవత్వములో పరిణామము జరగాలి. యీనాడు రాజకీయ పరిణామము జరుగుతూ ఉంటున్నాది. వైజ్ఞానిక పరిణామము జరుగుతున్నాది. ఆర్థిక పరిణామము జరుగుతున్నది. అన్ని పరిణామములతోబాటు మానసిక పరిణామముకూడా కావాలి. ఈ మానసిక పరిణామముతోబాటు ఆధ్యాత్మిక పరిణామము రావాలి. ఎంత వయస్సు వచ్చినప్పటికిని మానసిక పరిణామమే లేకపోతే ప్రయోజనము ఉండదు. మానవత్వమనేది మనస్సుపైన ఆధారపడి ఉంటున్నాది. మనస్సు మంచిదైనప్పుడే మనిషి మంచివాడౌతాడు. మనస్సంటే ఏమిటి? ఆలోచనలయొక్క చేరికే మనస్సు. ఆలోచనలంటే ఏమిటి? కేవలము మన నిత్య జీవితములో జరిగే చర్యలే! ఈ చర్యలు మారినప్పుడే ఆలోచనలు మారతాయి. ఈ ఆలోచనలు మారినప్పుడే మనసు మారుతుంది. ఈనాడు మన చర్యలు ఉండవలసిన రీతిలో ఉండటం లేదు. మన చర్యలు చాలా పవిత్రముగా జరగాలి. అప్పుడే మానవత్వము దివ్యత్వముగా మారిపోతుంది.

**మన జీవితము దినదినానికి ఉన్నతస్థాయికి చేరుకోవాలిగాని, దిగజారిపోకూడదు**

విద్యార్థులారా! మీ నడతలను, మీ వాక్కులను, మీ మానసిక తత్వమును చక్కగా పరిణామము చేసుకోవాలి. పరిపక్వముగావించుకోవాలి. మన జీవితము దినదినమునకు ఉన్నతస్థాయికే చేరాలిగానీ, దిగజారిపోకూడదు. అతని ఎదురుగా చెప్పకూడదుగానీ, యీ విధమైన అభివృద్ధిలోపల మన డా॥ శంకర్‌దయాళ్‌శర్మ చాలా ఉన్నతస్థితికి వచ్చాడు. ఇంతకు పూర్వము అతను చక్కని విద్యనభ్యసించాడు, ఉన్నత విద్యాలయములో. చక్కని సంస్కారమును పొందాడు. ప్రజాసేవలో MLA, MP నుండి ప్రారంభమయ్యాడు. రాష్ట్రమంత్రి అయ్యాడు. కేంద్రమంత్రిగా అయ్యాడు. గవర్నరుగా వచ్చాడు. గవర్నరునుండి ఉపరాష్ట్రపతి అయ్యాడు. ఉపరాష్ట్రపతినుండి రాష్ట్రపతి అయి వచ్చాడు. చూశారా! ఎంత ఉన్నతస్థాయికి ఎదిగాడో! ఒక్కొక్కతూరి అడుగడుగు పెరుగుతూ పోయాడుగాని, తరగలేదు. మిగతావారి జీవితములో ఒడిదుడుకులు జరుగుతూ వచ్చాయికానీ, శంకర్‌దయాళ్‌శర్మలో తనయొక్క సంస్కృతి, తనయొక్క విశ్వాసము, తన పవిత్రమైన

sri sathyasai vachanamrutam

భావమే అతనిని ఉన్నతస్థితికి తెచ్చాయి. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అని భావించి మాతృదేశమునందు విశ్వాసము, తల్లియొక్క సేవ అతను శ్రద్ధగా అనుభవిస్తూ వచ్చాడు. ఇప్పటికి వారి తల్లి జీవించి ఉంటున్నాది. ఈనాటికి అతడు వృద్ధురాలైన తన తల్లికి నమస్కరించి తరువాతనే తన కార్యములలో తాను ప్రవేశిస్తాడు. కనుకనే, గుణము కొద్దీ ఉన్నత స్థానము అతనికి లభిస్తూ వచ్చింది. అతడు రాష్ట్రపతి పదవిని యేమాత్రము తాను ఆశించలేదు. ఎవరి దగ్గరకు పోయి అడుగలేదు. భగవంతుని నమ్ముకున్నాడు. 'నాకా శక్తి యిస్తే భగవంతుడే యిస్తాడు,' అని భగవంతునిపైన బాధ్యత వేసి ఉన్నాడు. అడుగనివానికే చేకూరుతుంది యీ పవిత్రత!

**అడుగకువె ఓ మనసా**
**అడుగుకొలది అది అడుగున పడునని**
**అడుగకున్న పని వడిగానగునని ॥అడు॥**
**అడుగని శబరిని ఆదరించడే**
**అడుగక తనకై మడియు జటాయువు**
**కడకునేగి సద్గతి కల్గించడే ॥అడు॥**

అతడు రాష్ట్రపతి కావడం భారతీయుల భాగ్యమనే చెప్పవచ్చును. ప్రధానమంత్రి పదవికూడను తాను ఆశించలేదు. అందుకొరకు ప్రయత్నాలు చేయలేదు. అసలు ఆయన ఎలక్షనులో నిలబడలేదు. అలాంటిది వెతుక్కుని వచ్చి అతనిని పదవి వరించింది. అతనిని నిలబెట్టినవారే అన్ని విధాలా అతనికి దిగ్విజయాన్ని గావించారు. ఇది యీ సంవత్సరముయొక్క మహా విశిష్టత. మొట్టమొదట భారతీయులు స్వాతంత్ర్యమును పొందినప్పుడు బాబు రాజేంద్రప్రసాద్ రాష్ట్రపతి భవనంలో రాజ్యాధినేతగా నిల్చాడు. ఆ రాజేంద్రప్రసాద్‌యొక్క గుర్తు ఏమిటి? కాంగ్రెస్ టోపీ ధరించి రాష్ట్రపతి భవనంలో ప్రవేశించాడు. యిన్ని సంవత్సరముల తరువాత యిప్పుడు మరల అదేరకం టోపీ ధరించిన శర్మ రాష్ట్రపతి భవనంలో ప్రవేశించాడు. అట్లాంటివారే యింకా కొంతకాలం భారతదేశములో ఉంటుండి, భారతీయుల

srisathyasaivachanamrutam

క్షేమసమాచారములను గుర్తించి వారికి సేవలు చేస్తూ తాము ధన్యులు కావాలని అందరు ప్రార్థించాలి. ఈ యిరువురు సైలెంట్ వర్కర్సు! చీటికి, మాటికి ఏదో ఒక ప్రెస్ రిపోర్ట్సు యివ్వటం వారికి అలవాటు లేదు. అన్నింటిని చక్కగా విచారించి, చక్కగా యోచించి, పదిమందిని కలుపుకుని అన్ని విధముల నిర్ణయానికి వస్తున్నారు. అలాంటివారు యీనాడు ప్రధానమంత్రి, రాష్ట్రపతిగా తయారయ్యారు. అందువలన భారతదేశముయొక్క సద్గతి క్రమక్రమేణా అభివృద్ధి చెందుతూ త్వరలో దేశంలో సుస్థిర శాంతి నెలకొంటుందని ఆశిస్తున్నాను. ఎట్టి హృదయమో అట్టి బలము. ఎట్టి తిండో అట్టి త్రేపు. యిట్టి మంచివారు యీనాడు రావటంచేత భారతదేశమునకు అన్నీ మంచి జరుగుతాయి. అన్నింటా మంచి జరగాలని మీరుకూడను ప్రార్థించాలి.

**భగవద్విశ్వాసమువలన జరగలేనిది జగత్తులో ఏమీ లేదు**

విద్యార్థులారా! మీరు భావిభారతోద్ధారకులు. దేశముయొక్క మంచిచెడ్డలు విద్యార్థులపై ఆధారపడి ఉంటున్నాయి. కనుక, యీ విద్యార్థిదశలో మీరు యిలాంటివారిని విశ్వసించి, మంచిని విశ్వసించి, శ్రేయోమార్గానికి మీరు తగిన కృషి చేయాలి. మన భారతీయ సంస్కృతిని మీరు తప్పక విశ్వసించాలి. ఆవిధంగా విశ్వసించినవారికి సర్వము విజయమే చేకూరుతుంది. కృష్ణుడు చెప్పాడు: 'ఎప్పుడు ధర్మమునకు గ్లాని కలుగుతుందో అప్పుడు భగవంతుడు అవతరిస్తూ ఉంటాడ'ని. భగవద్గీతలో ధృతరాష్ట్రుడు సంజయుని ప్రశ్నించాడు.

**ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః**
**మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ?**

అని. 'ఎట్లా ఉన్నారు, మావారు? విజయము ఎవరికి సంభవిస్తుంది?' అని. ఒక్కటే చెప్పాడు, సంజయుడు:

**యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః,**
**తత్ర శ్రీ ర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ.**

'అర్జున' అనగా ప్యూరిటీ. ఎక్కడ ప్యూరిటీ ఉంటుందో, ఎక్కడ యూనిటీ ఉంటుందో, అక్కడ

sri sathyasai vachanamrutam

డివినిటీ ఉంటుంది. ఈ మూడింటియొక్క ఏకత్వము ఎక్కడ సంభవిస్తుందో అక్కడే విజయము. కనుక యూనిటీవల్ల ప్యూరిటీ, ప్యూరిటీవల్ల డివినిటీ! అందరు యూనిటీగా ఉంటుండాలి. ఐకమత్యమే బలం! దీనికి మించిన సౌఖ్యం మరొకటి లేదు. దురదృష్టవశాత్తు యీనాడు ఐకమత్యం అనేది ఛిన్నాభిన్నమైపోయింది. విద్యార్థులీనాడు ఐకమత్యాన్ని పెంచుతూ రావాలి. మీలో మీరు యూనిటీగా ఉంటూ వుండండి! కేవలము మన ఇనిస్టిట్యూట్‌లో ఉండినంత మాత్రమున చాలదు. బయట ప్రదేశములోకి పోయి యీ యూనిటీని అభివృద్ధి చెయ్యాలి. విద్యార్థుల విషయములో మన భారతదేశ రాష్ట్రపతి శంకర్‌దయాళ్‌శర్మ యిచ్చిన సందేశం చాలా అవసరమైనది. ఆయన విద్యార్థిగా ఉండినప్పుడు ఏఏ ఆలోచనలు చేశాడో, యేయే విధంగా తాను జీవించాలని అనుకున్నాడో అదే మీకందిస్తూ వచ్చాడు. తన ఆచరణే మీకందిస్తూ వచ్చాడు. 'ఆచార్య' అన్నారు. 'ఆచార్య' అనగా ఏమిటి? కేవలము ఉపాధ్యాయుడు కాదు. ఆచరించి అందించినవాడు, ఆచార్యుడు! కనుక, యీనాడు ఆచారత్వములో గల అంతరార్థము గుర్తించుకోవాలి.

విద్యార్థులారా! భారతదేశమునకు పవిత్రకాలము సంభవిస్తూ వచ్చింది. భారతదేశములో అనేక పవిత్రతలు అభివృద్ధి పొందుతాయి. దేశముయొక్క సౌభాగ్యము, శ్రేయస్సు అభివృద్ధి చెందుతుంది. మానవునికి శ్రేయోమార్గము, ప్రేయోమార్గము అని రెండు మార్గములు ఉంటున్నాయి. కాని, ప్రేయోమార్గముతోబాటు శ్రేయోమార్గముకూడా ఉంటుండాలి. యీ ప్రేయస్సు, శ్రేయస్సు రెండింటియొక్క ఏకత్వాన్ని మీరు పెంపొందింపచేయాలి. భగవద్విశ్వాసాన్ని పెంపొందించుకోండి! భగవద్విశ్వాసమే లేకపోతే మన జీవితమే వ్యర్థమవుతుంది. అంతా దానిపైనే ఆధారపడి ఉంది. సర్వమునకు దైవమే కారణము. సృష్టి, స్థితి, లయములకు దైవమే కారణము. కదిలించేది, కదిలేది రెండింటికి దైవమే కారణము. అట్టి సర్వశక్తిమయుడైన భగవంతునియందు విశ్వాసమును పెంచుకోండి! దానివల్ల జరగలేనిది ఒక్కటికూడను జగత్తులో లేదు. ఏమైనా జరుగుతుంది. ఆ విశ్వాసముతో విద్యార్థులు అభివృద్ధి కావాలి.

**(తేదీ 28-07-1992న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**